# ది మాస్క్

-జె.ఎస్.వి.ప్రసాద్

'ముసుగు వెయ్యొద్దు మనసు మీదా...' అంటూ మ్యూజికల్‌గా మ్రోగింది సెల్‌ఫోన్. ప్రక్కింటి పద్మావతితో కలసి షాపింగ్‌కి బయలుదేరుతున్న అపర్ణ ఫోన్ తీసి "హలో" అంది.

"హలో.. నేనొదినా" అంది అవతలి గొంతు.

ఆ పేరు వినగానే అపర్ణ నొసలు ముడివడ్డాయి. కానీ మర్యాద కోసం నవ్వు మొహం తగిలించుకుందామనుకుని మనిషి ఎదురుగా లేదు కాబట్టి గొంతులోనే ప్రేమ కురిపించింది.

"ఓ నువ్వా... మాధవీ! అంతా బాగున్నారా? ఏమిటి విశేషాలు?" అడిగింది ఎంతో ప్రేమగా.

"ఆ...అంతా బాగానే వున్నాం వదినా. పిల్లలకి సెలవులు కదా హైదరాబాద్ చూడాలని సరదా పడుతున్నారు. మా మామయ్యగారు, అత్తయ్యగారు కూడా ఎప్పుడూ హైదరాబాద్ చూడలేదుట. కాబట్టి మేమందరం రేపు రాత్రి నర్సాపూర్‌కి బయలుదేరుతున్నామన్నమాట" అని నవ్వింది.

"అన్నయ్యకి చెప్పొదినా. ఎల్లుండి ఉదయం కలుసుకుందాం" అని ఫోన్ కట్ చేసింది.

అపర్ణ నెత్తిమీద పిడుగు పడ్డట్టు అదిరిపడింది. మాధవి అపర్ణ పెదమామగారి కూతురు. అపర్ణకి స్వంత ఆడబడుచులులేని కారణంగా మాధవే కష్టపడి ఆ లోటు తీరుస్తుంటుంది. అర్ధమొగుడుగానూ, అంతకంటే ఎక్కువగానూ కూడా. అందుకే మాధవంటే అపర్ణకి వళ్లుమంట.

పైకి మాత్రం ప్రేమ నటిస్తుంది తప్పదు కనుక. అపర్ణ భర్త భార్గవ కూడా. మాధవిని చూస్తే గాభరా పడిపోతాడు, జేబు సర్దుకుంటాడు.

అటువంటి మాధవి సకుటుంబ సమేతంగా ఆ నెలాఖరురోజుల్లో ఆ ఇంట్లో అడుగుపెట్టబోతోంది.

అపర్ణ నుదుటికి పట్టిన చెమట తుడుచుకుంటూ కుర్చీలో కూలబడిపోయింది.

అక్కడే వున్న పద్మావతికి అపర్ణ మొహంలో మారుతున్న రంగుల భాష కొంచెం అర్ధమయింది. కానీ అస్సలు అర్ధం కానట్టు అమాయకపు మాస్క్ తగిలించుకుని అడిగింది.

"ఎవరండీ ఫోన్లో? బంధువులా?"

అపర్ణ నీరసంగా తలాడించింది.

"అవును. రాబందువులు...సకుటుంబంగా."

అప్పుడే గది ఊడ్చడానికి వచ్చిన పనిమనిషి మంగమ్మ చెవిలో పడ్డాయి ఆ మాటలు. ఆమె కూడా గతుక్కుమంది.

ఈ నలుగురికి చేయడానికే నా రెక్కలు ముక్కలై నడుం పడిపోతోంది. మళ్లీ మరో పటాలం దిగుతోందా ఈళ్ళ జిమ్మడిపోను అని మనసులోనే తిట్టుకుని తప్పించుకుందామన్నా తప్పేది కాదు కనుక గబగబా పళ్లన్నీ కనిపించేలా నవ్వే మాస్క్ తగిలించుకుంది.

"రానియ్యండమ్మా... ఎంతమందొస్తరో... ఎడంసేత్తో సేసి పారేత్తా" అంది ధీమాగా.

"నీదీ నీ బాబుదీ ఏం పోతుంది. నా సంసారమే చట్టుబండలవుతుంది. నాలుగురోజులకో వారం రోజులకో...." అని మనసులోనే పనిమనిషిని తిట్టుకుంది అపర్ణ.

అపర్ణ మొహం చూస్తుంటే ఆ రోజుకి ప్రోగ్రాం కాన్సిల్ అని అర్ధమైపోయింది పద్మావతికి.

"మీ మనసేం బాగోలేదుకదా.... మరోసారి వెళ్దాంలెండి షాపింగ్‌కు" అంటూ వెళ్లిపోయింది.

***

సాయంత్రం భార్గవ ఆఫీసు నుంచి వచ్చాక వేడి వేడి కబురు చల్లగా చెప్పింది అపర్ణ. అతను అదిరిపడ్డాడు.

"మా మాధవా? ఫ్యామిలీతోనా? బాప్‌రే... అసలే సమ్మర్. త్రాగడానికే నీళ్లు దొరకడంలేదే. అంతమంది వస్తే ఇంటి ఓనర్ ఊరుకుంటాడా?" అంటూ తల పట్టుకున్నాడు భార్గవ.

విజయవాడ నుంచి ట్రాన్స్‌ఫరై వచ్చి రెండు నెలలు పూర్తవలేదు. ఫ్యామిలీ పూర్తిగా సెటిలవలేదు. బడ్జెట్ ఇంకా ఒక కొలిక్కి రాలేదు. పైగా నెలాఖరురోజులు.

అపర్ణ చాణక్యుడి మాస్క్ తగిలించుకుని భర్త చెవిలో ఒక ప్లాన్ చెప్పింది.

భార్గవ ఎగిరి గంతేసాడు. భార్య చేయి అందుకుని తెగ షేక్ చేసేసాడు.

ఆ ఆరు పోర్షన్ల బిల్డింగ్ ఓనర్ ఖాదర్‌ఖాన్, అతని భార్య పక్క వీధిలో ఓ రేకుల షెడ్డులో ఉంటారు. అది అతని స్వార్జితం. అతని ఇద్దరు కొడుకులు దుబాయ్‌లో ఉన్నారు. ఆ బిల్డింగ్ వాళ్ల స్వార్జితం.

వాటిమీద వచ్చే అద్దెలు ఖాన్ కష్టార్జితం. తిన్నంత తిని మిగిలినది కొడుకుల పేర బ్యాంకులో వేయవచ్చు. అందుకే వేరే పనేమీ లేకుండా ఇరవై నాలుగుగంటలూ ఆ బిల్డింగ్‌ను కనిపెట్టుకుని ఉంటాడు. రూల్స్ అండ్ రెగ్యులేషన్స్ ఖచ్చితంగా పాటిస్తాడు.

భార్గవ వెళ్లేసరికి ఖాదర్‌ఖాన్ లేడు. అతని భార్య ఉంది.

ఖాన్ కోసం ఎదురుచూసే టైం లేక భార్గవ ఆమెతో తన సమస్యలన్నీ ఏకరువు పెట్టి తన భార్య చెప్పిన ప్లాన్‌చెప్పి ఖాన్‌గారికి వివరించి చెప్పమన్నాడు.

ఆమె భార్గవని జాలిగా చూసి "సరే బేటా" అంది.

★★★

రోజూ ఏడుగంటలకు లేచే భార్గవకి ఐదు గంటలకే లేవవలసి రావడం చాలా బాధగా ఉంది.

అయిష్టంగానే తయారై స్టేషన్‌కి వెళ్లడానికి బయలుదేరాడు.

"ఆ మొహంతో స్టేషన్‌కి వెళితే వాళ్లు రావడం మనకి ఇష్టంలేదేమోనని కనిపెట్టేస్తారు. కాస్త చిరునవ్వు తగిలించుకుని వెళ్లండి" అంది అపర్ణ.



ట్రైన్ ఎప్పటిలాగే ఆలస్యంగా వచ్చింది. బంధువులంతా బిలబిలా దిగారు.

పిల్లలూ, పెద్దలూ భార్గవ కంటే ఎక్కువ నవ్వు చిందించే మాస్కులు తగిలించుకున్నారు.

మాధవి మామగారు భార్గవ వీపుమీద ఆప్యాయంగా చరిచారు. ముందుకు తూలిపడ్డ భార్గవ్‌ని "బాగున్నావా అన్నయ్యా?" అని పలకరించింది మాధవి.

"బావగారూ బాగున్నారా?" అని జోకేసి తనే నవ్వాడు ఆమె భర్త.

భార్గవ రెండు ఆటోలు మాట్లాడాడు. ఆటోవాలాలు చాలా వినయంగా ఉండే మాస్కులు తగిలించుకుని "చాలా దూరం సార్. మీటర్‌మీద పంద్రా ఇవ్వండి" అన్నారు.

భార్గవ చాలా తెలివిగా బేరం ఆడి మీటరుమీద పదిహేనుకి వప్పించాడు. ఆటోలు ఇంటిముందు ఆగగానే మాధవి భర్త అప్పుడే ఆకాశంలో క్రిందగా ఎగురుతున్న ఓ ట్రైనింగ్ విమానాన్ని పిల్లలకు చూపిస్తూ దాని కూడా కొంత దూరం వెళ్లిపోయాడు. మాధవి, అత్తగారు, మామగారు ఎత్తుగా ఉన్న అపార్ట్‌మెంట్లలోని అంతస్తులు లెక్కించడంలో మునిగిపోయారు.

భార్గవకి తప్పలేదు. ఆటోవాళ్లకి డబ్బులిచ్చేసి సామాన్లుకొంచెం లోపలకు తెచ్చి పెట్టమని రిక్వెస్ట్ చేసాడు.

వాళ్లు అది మా పనికాదు బే అన్నారు.

"ఇందాక సార్ అన్నారు?" అన్నాడు భార్గవ అమాయకంగా, కొంచెం కోపంగా.

వాళ్లు నవ్వుకుంటూ ఆటోలోని సామాను రోడ్డుమీద దింపేసి వెళ్లిపోయారు.

భార్గవ, అపర్ణ సామానంతా లోపలకు చేర్చేసాక అప్పుడు అంతా లోపలకు వచ్చారు. అపర్ణ, ఆనందంతో వెలిగిపోతున్న మాస్క్ తగిలించుకుని అందర్నీ పలకరించింది. మాధవినైతే గట్టిగా కౌగలించుకుని ముద్దాడినంత పని చేసింది.

పలకరింపులయ్యాక అంతా స్నానాలు చేసి టిఫిన్లు మీద పడ్డారు. ఇల్లంతా రణగొణ ధ్వనితో రైలు స్టేషన్‌లా వుంది. సరిగ్గా అప్పుడొచ్చాడు ఇంటి వోనర్ ఖాదర్‌ఖాన్.

"హేమ్టి భాయ్. హింటోగానీ షాదీ ఐతంద్యా. హింత జనం ఉందీ?" అన్నాడు.

"అబ్బే... వీళ్లంతా మా బంధువులే ఖాన్‌భాయ్. ఓ వారం ఉండి ఊరు చూసి వెళతారు" అన్నాడు భార్గవ.

మామూలు సందర్భంలోనూ, ఎవర్శికైనా ఇల్లు అద్దెకిచ్చే సమయంలోనూ ఖాదర్‌ఖాన్ కళ్లు, మీసాలు తెల్లగా ప్రశాంతంగా ఉంటాయి. కానీ అద్దెలు వసూలు చేసేటప్పుడూ, అద్దెకున్నవాళ్లు మధ్య గొడవలు తీర్చవలసి వచ్చినప్పుడు అతని ఎర్రటి కళ్లు పెద్ద పెద్ద మీసాలుగా ఉన్న మాస్క్ తగిలించుకుని వస్తాడు.

బంధువులు వారం రోజులు ఉంటారని వినగానే ఖాన్ వెంటనే ఆ మాస్క్ తగిలించేసుకున్నాడు.

"హేమ్టి వారం ఉంటారూ? వచ్చేటప్పూ నీళ్లు తెచ్చుకున్నారా? నైతో రోజ్ స్నానాలూ, కారం తిన్డాలూ మానేస్తారా? కారం హెక్వా తింటే నీళ్లూ హెక్వా తాగాల్గదా?" అన్నాడు కోపంగా.

"అదేమిటి ఖాన్‌భాయ్. అసలే వేసవికాలం. స్నానాలు చేయకుండా, నీళ్లు త్రాగకుండా ఎలా ఉండగలం?" చేతులు నలుపుకుంటూ దీనంగా చూసాడు భార్గవ.


"గర్మీ గన్కే చెప్పేది. మీకూ రోజ్కీ హిచ్చే పదీ బిందెల్ పానీ కంటే ఒక్కా బిందే కూడా హెక్వా హివ్వన్" గర్జించాడు ఖాన్ షేర్‌ఖాన్‌లా.

"ప్లీజ్ భాయ్. ఈ ప్రక్క పోర్షన్ ఖాళీగానే ఉందికదా. వాళ్ల వాటా పది బిందెలూ ఈ నాలుగురోజులూ మాకివ్వండి" ప్రాధేయపడే మాస్క్ వేసుకుని అడిగాడు.

అతనికి బాగా తెలుసు. అతనేగా చెప్పాడు. ఖాన్ అందుకు ససేమిరా అంటాడనీ, నీళ్ల బాధ తట్టుకోలేక చుట్టాలు రెండురోజుల్లోనే మూటాముల్లే సర్దుకుంటారనీ అనుకున్నాడు. కొంతవరకూ కథ బాగానే సాగింది కానీ అక్కడే అడ్డం తిరిగింది.


ఒక పోర్షన్ ఖాళీగా ఉన్న విషయం గుర్తుకు రాగానే ఖాన్ బుర్రలో ఒక ఐడియా తళుక్కున మెరిసింది.

"నై..." అంటూ అరిచాడు ఆరు పోర్షన్లకూ వినబడేలా.



## తర్వాత మానేస్తాను

సిగరెట్లు తాగడం మానేస్తున్నానని ప్రకటించిన ఆమీర్ ఖాన్ తిరిగి సిగరెట్లు తాగుతున్నాడు. 'నాకు మరీ స్ట్రెస్ ఎక్కువైనప్పుడు సిగరెట్లు తాగాలనిపిస్తుంది. అందుకే తప్పనిసరై సిగరెట్లు తాగుతున్నాను. కాస్త ప్రశాంతంగా మారాక మానేస్తాను' అంటున్నాడు. తన మేనల్లుడు ఇమ్రాన్ హీరోగా 'జానే తూ..యా జానేనా' సినిమాని సొంతంగా నిర్మించిన ఆమీర్ ఆ సినిమా ఏమవుతుందా అనే టెన్షన్‌లో సిగరెట్లు తిరిగి మొదలెట్టాడట. కానీ ఆమీర్‌లో వున్న గొప్పతనం ఏమిటంటే పిల్లల ముందు, పబ్లిక్ ప్రదేశాల్లో మాత్రం సిగరెట్లు కాల్చడు.



"హా పోర్షన్ పానీ హక్కడే ఖతమ్ కావాల. హిక్కడ్కి రాకూడద్. కానీ పానీ కావాలంటే మీరే హక్కడ్కి పోవాల. హదీ పక్కనేకదా. హదీ కూడా వాడ్కోండీ. ఆరామ్‌గా హుండండి'' అని కొన్ని క్షణాలాగి చెప్పాడు.

"ఆధా మహీనే కా కిరాయాతో పూరా ఆరామ్ మిలేగా. అల్లా భలాక రేగా!''

భార్గవ చెవుల్లో సముద్రపు హోరు వినబడింది. కళ్లముందు చీకటి అల ముకుంది.

కొంతసేపు ఏమీ అర్థం కాలేదు. తర్వాత కొంచెం అర్థమయింది. అప్పుడు నెత్తిమీద వంద పిడుగులు ఒకేసారి పడ్డాయి. నోట్లోంచి మాట రాలేదు. తేరుకుని ఏదో అనబోయేంతలో అక్కడే ఉన్న మాధవి ఆనందంతో చిన్న కేక పెట్టింది.

"ఇదేదో చాలా బాగుందన్నయ్యా. ఇంతమందిమి ఒకే చోట ఇరుక్కునే కంటే ఖాళీ పోర్షన్ మన అదృష్టం కొద్దీ ప్రక్కనే దొరికింది కాబట్టి అందాకా అది కూడా తీసుకుంటే హాయిగా ఉండవచ్చు. ఇంకాస్త తీరుబడిగా ఊరంతా తిరిగి చూడవచ్చు'' అంది ఎంతో ఆనందంగా.

చుట్టాలంతా హమ్మయ్య అని ఆనందంగా రిలాక్స్ అయ్యారు.

అపర్ణ, భార్గవ్ మాత్రం భయం భయంగా ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు.

అపర్ణ కళ్లముందు భార్గ పర్సులోంచి రూపాయలు తుపాన్ గాలికి ఎండుటాకుల్లా ఎగిరిపోతున్నట్లు, భార్గవ కళ్లకి అపర్ణ మెడలోని నగలు ఒక్కొక్క టీ రెక్కలు తగిలించుకుని షరాబు దుకాణాలకు ఎగిరిపోతున్నట్లు కనిపించసాగాయి.

మాధవి చురుకైన బుర్రకి అన్నీ కనిపిస్తున్నాయి, వినిపిస్తున్నాయి. కానీ నిస్సంకోచంగా కళ్లూ చెవులూలేని మాస్క్ తగిలించేసుకుని ఆనందో బ్రహ్మ అనుకుంటోంది. తన వాళ్లకి కూడా అలాంటి మాస్కులే తగిలించే స్తోంది.

***

ఈ ప్రపంచమంతా మాస్కుల మయమే. ప్రతి మనిషీ తన అసలు స్వభావాన్ని దాచుకుని పైకి అందమైన మాస్క్ తగిలించుకుని బ్రతికేస్తున్నాడు.

మాస్కులు...మాస్కులు...మాస్కులు... ప్రపంచంలోని మనుషులంతా జేబుల్లోనూ, చేతి సంచీల్లోనూ, సూట్‌కేసుల్లోనూ, రకరకాల మాస్కులు దాచుకుని, సందర్భానికో మాస్క్ తగిలించేసుకుని నటించేస్తున్నారు కాదు జీవించేస్తున్నారు.

ఏ మాస్కులూ లేకుండా, ఏ భేషజాలూ లేకుండా స్వంత వ్యక్తిత్వంతో మనిషి బ్రతకలేడా?

***

కథ పూర్తయ్యాక తను వ్రాసిందంతా భార్యకి చదివి వినిపించాడు రచయిత రమాకాంత్.

"చాలా బాగా వచ్చిందండీ'' అందామె మెరిసే కళ్లతో.

"ఇదంతా నీ క్రెడిట్టే డియర్. నువ్వింత మంచి మంచి ప్లాట్లు అందించకపోతే నేనింత గొప్ప రచయితనయ్యేవాడినా? ఇంత సంపాదించగలిగేవాడినా? నా అదృష్ట దేవత నువ్వు. నా జీవన నౌక చుక్కానివి నువ్వు'' అంటూ ఆమెని దగ్గరకు తీసుకుని ముద్దుల్లో ముంచెత్తాడు రచయిత రమాకాంత్.

అతని మాటలు వింటుంటే ఆమెకి నాటకాలు గుర్తుకువచ్చాయి. మరింతగా అతని వడిలో ఒదిగిపోతూ అంది.

"మీకు చెప్పడం మర్చిపోయాను. నిన్న వృద్ధ రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం వాళ్లు వచ్చారు. మీ అభిమానులట కూడా. చందా ఇమ్మంటే మూడు వందలుంటే ఇచ్చాను.''

అతను తన వడిలో వున్నది పామో తేలో అన్నట్లు ఒక్కసారిగా ఆమెను తన వళ్లోంచి క్రిందకి తోసేసాడు. ఆమె కళ్లు విప్పార్చుకుని చూడసాగింది.

"స్టుపిడ్! బుద్ధిలేదూ, జ్ఞానంలేదూ. మనిషివా, పశువ్వా? రెక్కలు ముక్కలు చేసుకుని నేను సంపాదిస్తుంటే నీ బాబుగారి సొమ్ములా వందలకి వందలు దానాలు చేస్తావా? ఇడియట్...ఛీ...'' అంటూ అతను మొహం కందగడ్డలా చేసుకుని బయటకు వెళ్లిపోతుంటే వెనుకనుంచి ఆమె అంది.

"ఆ మొహంతో బైటకు వెళ్లకండి బాగోదు. ఏదైనా నవ్వు మాస్క్ తగిలించుకోండి.''

★

## వింతలు...విశేషాలు

★ వాహనాలను వెనుకకు నడపడం ప్రమాదకరమని మనందరికీ తెలుసు. అలా నడపాల్సి వచ్చినప్పుడు ఆయా వెహికిల్స్ 'బీ కేర్ ఫుల్, 'వెహికిల్ ఈజ్ కమింగ్ బ్యాక్' అని అరిచేలా జపాన్‌లోని వాహనాలకు ప్రత్యేకమైన ఏర్పాటు చేసారు. అవి అలా అరవడమే కాకుండా ఈ మేరకు అక్షరాలు కూడా వెలుగుతూ ఉంటాయి.

★ ఆస్ట్రేలియాలో మొట్టమొదట కనిపించిన చెట్టు యూకలిప్టస్. ఈ చెట్టులో విశేషమేమిటంటే అది అన్ని చెట్లు రాల్చినట్లుగా ఆకులను రాల్చదు. కానీ అందుకు బదులుగా తన కాండంపైనున్న పొరను పెచ్చులు పెచ్చులుగా రాలుస్తుంది.

★ ప్రపంచంలోకెల్లా అతి పెద్ద జైలు రష్యాలో వుంది. ఆ జైలులో నలభై వేలమంది ఖైదీలు ఉండడానికి అవకాశముంది.

★ మధ్యతరహా లేజర్ కిరణాల ప్రసారం ద్వారా బట్టతలమీద తిరిగి వెంట్రుకలు మొలిచేట్లుగా చేయవచ్చునని ఇటలీలోని రోమ్ నగరంలో జరిపిన జరిపిన పరిశోధనల్లో కనుగొన్నారు. వుర్రెలో లేజర్ కిరణాలను ప్రసరింపజేస్తే వెంట్రుకలు మొదళ్లలో తిరిగి పెరుగుదల ఆరంభమవుతుందిట.

★ చిన్న చిన్న నేరాలు చేసినవాళ్లు అపరాధ రుసుమైనా చెల్లించాలి లేదా దానికి బదులుగా రక్తదానమైనా చేయాలని శిక్ష విధిస్తున్నాడు ఓ జడ్జి. అమెరికాలోని ఓహియోలోని బటల్‌లియాకు చెందిన క్లిర్‌మౌంట్ కౌంటీ కోర్టులో పని చేస్తున్న రాబర్ట్ చాపెల్ ఈ వింత శిక్షను అమలు చేస్తున్నాడు.

-శ్రీరామ

